క్లుప్తంగా

పూడికతీత పనులు పరిశీలన

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం చెరువులో ఈజీఎస్‌ అధికారులు చేపట్టిన పూడికతీత పనులను బుధవారం ఇరిగేషన్‌ ఏఈ లక్షన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడారు. ఉపాధి హామీ పనులను నిబంధనల మేరకు చేయాలన్నారు. కొలతల ప్రకారం కూలి చెల్లిస్తామన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఉదయం 7 గంటలకు పనులు ప్రారంభించి ఎండతీవ్రత పెరగముందే ఇండ్లకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్‌ అసిస్టెంట్‌ అశోక్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌ వెంకట్రాములు, కూలీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన మాధవి అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి డాక్టర్‌ మందా జగన్నాథం కొండేరుకు చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా సాసనూలు గ్రామానికి చెందిన బీసన్న అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ నాయకుడు శ్రీధర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మానవపాడు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఏపీడీ నాగేంద్రం అన్నారు. బుధవారం మండలంలోని చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలలోని పలు రకాల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సీసీ రోడ్లు, పారిశుద్ధ్య పనులు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా గ్రామాలలో నెలకొన్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మంత్రి క్షమాపణ చెప్పాలి

ఎర్రవల్లిచౌరస్తా: దళితులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ వెంటనే క్షమాపణ చెప్పాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌ ఎంజీ కృష్ణ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్‌ సమావేశంలో మంత్రి దళితులను థర్డ్‌క్లాస్‌ ప్రజలంటూ వ్యాఖ్యానించారని మండిపడ్డారు. దళితులను అవమానించేలా మాట్లాడిన మంత్రిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్‌ చేయాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్‌ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి అవమానించారని.. బీఆర్‌ఎస్‌ మంత్రి దళితులను అవమానించేలా మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. మంత్రి దళితులకు క్షమాపణలు చెప్పకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రేపల్లె రాజు, సురేష్‌బాబు, యువరాజు, బీసన్న, రాంబాబు, జయ్యన్న, తదితరులు ఉన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శాంతినగర్‌: వడ్డేపల్లి కేజీబీవీ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ఎస్‌ఓ పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు 2023–24 ఏడాదికి ఎంపీసీ, బైపీసీ తెలుగు మీడియంలో చేరడానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మార్కుల మెమో, టీసీ, బోనఫైడ్‌, ఆధార్‌కార్డు జిరాక్స్‌ కాపీలతోపాటు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు కళాశాలలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్‌: 7013946202 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

శాంతినగర్‌: అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్‌ సీఈఓ ముషాహిదాబేగం సూచించారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించిన అనంతరం నర్సరీని సందర్శించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని నిర్వాహకులకు సూచించారు. సీఈఓ వెంట ఎంపీడీఓ రవీంద్ర ఉన్నారు.

నిందితులకు రిమాండ్‌

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సాయిశ్రీ వైన్స్‌ వద్ద ఘర్షణ పడిన వ్యక్తులు మహేష్‌, యాదగిరి, శివలపై బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ జగదీష్‌ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో 10వ తేదీన కొల్లాపూర్‌ చౌరస్తాలో ఉన్న సాయిశ్రీ వైన్స్‌ షాపు వద్ద లిక్కర్‌ కొనుగోలు చేసే క్రమంలో వై.శాఖాపూర్‌ గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు మహేష్‌, యాదగిరి, శివల మధ్య గొడవ జరగడంతో పాటు లక్ష్మయ్యను తీవ్రంగా గాయపర్చారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురిని కోర్టుకు హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగదీష్‌ తెలిపారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- రోడ్లపైనే మురుగు పరుగు
- పట్టించుకోని అధికారులు


మానవపాడులో ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న మురుగు

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ గ్రామ పంచాయతీలలో మురుగు కాలువలు లేక రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. కొన్ని గ్రామాల్లో మురుగు ఒకే చోటు నిల్వ ఉండటంతో గ్రామస్తులు దుర్వాసన భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు రోడ్లపై పరుగులు పెడుతోంది. కంపు వాసన భరించలేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలకు 8 గ్రామాల్లో మురుగు కాలువల నిర్మాణాలు సరిగ్గాలేవు. దుర్గంధంతో ఇబ్బందులు పడుతుంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

నిల్వ నీటిలో దోమలు వృద్ధి..

పంచాయతీల్లో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు ఒకే దగ్గర పేరుకుపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలు గ్రామాల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో మురుగు రోడ్లపై పారి దుర్వాసన వెదజల్లుతోంది.

పనుల్లోనూ.. అలసత్వం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె ప్రగతి పనుల్లో నాయకులు, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాల్లో జరుగుతున్న చాలా పనులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్న పనులు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కాలనీలలోని రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి..



మురుగు కాలువలు నిర్మించాలి. ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. ఇంటి ముందు నిత్యం మురుగుతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – యుగంధర్‌, చెన్నిపాడు

నిధులు మంజూరు చేయాలి..



పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. వర్షాకాలంలో బస్టాండ్‌కు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం అధ్వానంగా ఉంటోంది. కంపు వాసన భరించలేకపోతున్నాం. – రమేష్‌, మానవపాడు

డ్రెయినేజీలు నిర్మిస్తాం..

డ్రెయినేజీలు లేని గ్రామాల్లో నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం. – రమణారావు, ఎంపీడీఓ మానవపాడు

ఉపాధి కూలీల సమయపాలన తప్పనిసరి


ఇటిక్యాలలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎర్రవల్లిచౌరస్తా: వేసవిదృష్ట్యా ఉపాధి కూలీల సమయ పాలన తప్పనిసరి పాటించాలని ఎంపీడీఓ రాఘవ అన్నారు. బుధవారం ఇటిక్యాల గ్రామ పంచాయతీని సందర్శించి పలు రికార్డులను, అంతర్గత రోడ్లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మస్టర్‌లో తప్పకుండా కూలీల వివరాలు నమోదు చేయాలన్నారు. వేసవికాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన అయ్యమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి పోతురాజు సోమనాద్రి సూచన మేరకు బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, యోహాన్‌, బీసన్న, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌కు పరామర్శ


విజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌ కుమార్‌

ఉండవెల్లి: కర్నూల్‌లోని సంజీవని ఆస్పత్రిలో మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌ విజయ్‌ కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే సంపత్‌ కుమార్‌ పరామర్శించారు. బుధవారం ప్రమాదానికి గురై కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు గోపాల్‌, రాము, రుక్మానంద రెడ్డి పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేద్దాం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అయిజ: ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ సాయిప్రకాష్‌ అన్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని ఉప్పలలో కార్మికులు రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రతి రోజు రోడ్లను శుభ్రం చేయాలని, మురుగు పూడికతీత పనులు చేపట్టాలని పారిశుద్ధ్య కార్మికులకు ఆయన సూచనలు చేశారు. చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే చెత్తను వేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ తిమ్మప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు


ఓటరు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గట్టు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని చాగదోనలో బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలనను ఎండకట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, నాయకులు వీరశేఖర్‌గౌడ్‌, రామకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్‌ బూత్‌ కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

శాంతినగర్‌: ఆంగ్లంపై పట్టు సాధించాలని అసోసియేట్‌ ప్రొఫెసర్‌ రాజునాయక్‌ అన్నారు. బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు–ఇంగ్లీష్‌ అనువాదంలో ఎదురయ్యే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పోషయ్య, అరుణాబాయి, జీవా జయరాజు, అధ్యాపకులు చంద్రమోహన్‌, డాక్టర్‌ శివనారాయణ, డా.ఏడుకొండలు, వెంకటేష్‌, లక్ష్మీనారాయణ, రాజేష్‌, బీసన్న, మహేష్‌లు పాల్గొన్నారు.

మేడికొండను మండల కేంద్రంగా ప్రకటించాలి


మాట్లాడుతున్న జిల్లా జేఏసీ కన్వీనర్‌ మధు

అయిజ: మండలంలోని మేడికొండను నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు మూడో రోజు బుధవారం నిరాహారదీక్ష కొనసాగించారు. జిల్లా జేఏసీ కన్వీనర్‌ మధుసూదన్‌ బాబు నిరాహార దీక్ష శిబిరం చేరుకొని గ్రామస్తులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మేడికొండను నూతన మండలంగా ప్రకటించకుంటే భవిష్యత్తులో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామంలోని 100 మంది నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా పరిషత్‌ సీఈఓ ముషాహిదాబేగం


శాంతినగర్‌లో క్రీడాకారులతో జెడ్పీ సీఈఓ ముషాహిదాబేగం

శాంతినగర్‌: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని జిల్లా పరిషత్‌ ముఖ్య కార్యనిర్వహణాధికారి ముషాహిదాబేగం అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సీఎం కప్‌ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా స్ఫూర్తి ఆడాలని సూచించారు. అనంతరం జరిగిన వాలీబాల్‌ పోటీలను తహసీల్దార్‌ జయరాములు టాస్‌వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత, మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కరుణ, ఎంపీడీఓ రవీంద్ర, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంపీఓ తిరుపతన్న, ఎంఈఓ నరసింహులు, పీఈటీలు పరమేష్‌, వీరేష్‌, బాష పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్‌ మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విజేతలకు ఎంపీపీ నజీమున్నీసా బేగం, సర్పంచ్‌ పద్మమ్మ, ఎంపీటీసీ దొలన్నలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్‌, ఎంఈఓ సురేష్‌, పీఈటీలు శ్రీనివాసులు, ప్రభాకర్‌, ఎంపీఓ కృష్ణమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ రాజారెడ్డి క్రీడాకారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సీఎం కప్‌ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపునకు సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డితో కలిసి హాజరయ్యారు. వాలీబాల్‌, క్రికెట్‌, కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ శేఖర్‌, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ కొండారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, పెద్దవీరన్న, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, పీఈటీలు వెంకట్రాములు, సుభాషిణి, తిరుమల్‌ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్‌ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఎంపీపీ మనోరమ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్‌లో చింతలకుంట జట్టు మొదటి స్థానంలో, కబడ్డీలో పాతపాలెం జట్టు ప్రథమ స్థానంలో, కబడ్డీ ఉమన్స్‌ విభాగంలో చింతలకుంట జట్టు నిలిచాయి. ఎంపీడీఓ అజగర్‌ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ శక్తిపీఠం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్‌–2023 మండల స్థాయి పోటీలను పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో తహసీల్దార్‌ సుభాష్‌నాయకుడు, ఎస్‌ఐ మహేందర్‌ ప్రారంభించారు. ఎంపీడీఓ రమణారావు పర్యవేక్షించారు. సూపరింటెండెంట్‌ రాజు, ప్రాజెక్టు డైరెక్టర్‌ నాగేష్‌బాబు, పీఈటీ శ్రీనివాస్‌లు, రాజు, బి.నాగరాజు, శివనాయుడు, సీనియర్‌ వ్యాయామ ఉపాధ్యాయుడు, మాధవరాయుడు, వీరేంద్ర, విజయ్‌, మన్సూర్‌బాషా, కల్యాణి పాల్గొన్నారు.


ధరూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట..


కేటీదొడ్డిలో..

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు


శాంతినగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎంఏఓ రాధ, ఎస్‌ఐ శ్రీనివాసులు


రాజోళిలోని తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ, ఏఓ

శాంతినగర్‌: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వడ్డేపల్లి వ్యవసాయ అధికారి రాధ అన్నారు. బుధవారం పట్టణంలోని విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి ఏఓ తనిఖీ చేశారు. సాయిబాలాజీ సీడ్స్‌ పెస్టిసైడ్స్‌, భాగ్యలక్ష్మి ఆగ్రో ఏజెన్సీస్‌లలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ రైతులు లూజు విత్తనాలు కొనరాదని కోరారు. ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, దుకాణ యజమానులు ఉన్నారు.

రాజోళి: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సీహెచ్‌ కుర్మయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఏఓ చంద్రశేఖర్‌తో కలిసి ఫర్టిలైజర్‌, సీడ్స్‌ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన వాటికి బిల్లులు ఇవ్వాలన్నారు.

బాలికలకు స్వేచ్ఛ అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న బాలిక

రాజోళి: బాలికలకు స్వేచ్ఛ అవసరమని ఎంపీడీఓ గోవిందు రావు అన్నారు. మండల కేంద్రంలోని న్యూప్లాట్స్‌ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంవీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో కిశోర బాలికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు రక్షణ, చదువు, సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్ట విరుద్ధమన్నారు. ఎదుర్కొంటున్న సమస్యలను, వారికి కావాల్సిన సదుపాయాలను గురించి బాలికలు వివరించారు. విద్య ప్రాధాన్యాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్‌ మండల ఇన్‌చార్జ్‌ హనిమిరెడ్డి, ఫౌండేషన్‌ సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలి


ధరూరు ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా..


మల్దకల్‌లో నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలు

మల్దకల్‌: వీఓఏలను ప్రభుత్వం సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏల సంఘం మండల నాయకుడు బాషా ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. వీఓఏల నిరవధిక సమ్మె బుధవారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు చంద్రాములు, హనుమంతు, కృష్ణ, వెంకట్రాములు, అపర్ణ, నీలమ్మ, నవీన, ఎస్తేర్‌, తిరుమలేష్‌, జనార్దన్‌, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట సమ్మె కొనసాగింది. కనీస వేతనం రూ.26 వేలు, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి, భీమేష్‌, భాగ్యలక్ష్మి, పావని, రూతమ్మ, తిమ్మప్ప, శివన్న, సత్యనారాయణమ్మ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఎదుట వీఓలు చేపట్టిన నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రేడింగ్‌ విధానాన్ని రద్దు చేయాలని, వీఓఏల ఖాతాల్లోనే నేరుగా వేతనాలు జమ చేయాలని డిమాండ్‌ చేశారు. వేయాలని వీఓఏలు డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సురేష్‌, వీరేష్‌గౌడ్‌, నాగరాజు, మహదేవ్‌గౌడ్‌, వీరన్న, వెంకటేష్‌, మునేశ్వరి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ఈర్లదిన్నెలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రజల ఆర్థిక సహకారాలతో నిర్మించబడిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠలు, శివాంజనేయ స్వామి ఆలయంలో లింగమయ్య, బొడ్రాయి, ధ్వజస్తంభ, గ్రామ దేవతలు, నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

పూజల్లో పాల్గొన్న నాగరాజ్‌గౌడ్‌

ఈర్లదిన్నెలోని శివాంజనేయ ఆలయంలో జరిగిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌ హాజరై, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నాగరాజ్‌గౌడ్‌ను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌, పోసిరి గారి విష్ణు, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

లింగన్‌వాయి లిఫ్ట్‌ మార్పునకు సీఎం సానుకూలం


హైదరాబాద్‌లో ఇరిగేషన్‌ అధికారులను కలిసిన ఎమ్మెల్యే, రైతులు

ఉండవెల్లి: లింగన్‌వాయి లిఫ్ట్‌ మార్పునకు సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇరిగేషన్‌ శాఖ కార్యాలయంలో చీఫ్‌ ఇంజనీర్‌ రఘునాథ్‌ రావుతో రైతులతో కలిసి లింగన్‌వాయి లిఫ్ట్‌పై ఎమ్మెల్యే చర్చించారు. గతంలో 2000 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రతిపాదనలు పంపించారని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలంటే 6500 ఎకరాలకు సాగునీరు అందాలని వివరించారు. దీనికోసం లిఫ్ట్‌ పనుల్లో కొంత మార్పులు అవసరమని పేర్కొన్నారు. దీంతో అలంపూర్‌ మండలంలో కాశీపురం, సింగవరం, గ్రామాల రైతులకు కూడా నీరు అందుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనలు సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు అజయ్‌, లింగన్‌వాయి రైతులు పాల్గొన్నారు.